

అంగన్‌వాడీలను పకడ్బందీగా నిర్వహించాలి

కేంద్ర మంత్రిత్వశాఖ అధికారులు జ్ఞానేశ్ బార్టి, భాస్కర్



రాయిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు, బాలామృతాన్ని తనిఖీచేస్తున్న జ్ఞానేశ్ బార్టి, భాస్కర్

భువనగిరి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి జ్ఞానేశ్ బార్టి, ఐఏఎస్ అధికారి భాస్కర్ అన్నారు. భువనగిరి పట్టణ శివారులోని రాయిగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు తనిఖీచేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో అమలు చేస్తున్న ఆరోగ్యలక్ష్మి, పోషణ ట్రాకర్ యాప్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అదే విధంగా పిల్లల బరువు, ఎత్తు కొలిచి యాప్‌లో ఎలా నమోదు చేశారో చూశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బాలామృతం, పాలప్యాకెట్లను పరిశీలించారు. వారి వెంట రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయ అధికారులు నర్సింహారావు, రాహుల్, ఐసీడీఎస్ పీడీ కె.నర్సింహ, సీడీపీవో శైలజ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



8

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

- రైతులకు రాయితీపై మొక్కల పంపిణీ
- ఈ ఏడాది 2,500ఎకరాల విస్తీర్ణం లక్ష్యం
- ఇప్పటివరకు 950 ఎకరాల్లో సాగు
- పంట సాగుతో ఏటా రూ.73వేల ఆదాయం
- అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులు

ప్రభుత్వం పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందే పంటలు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించేలా ఉద్యానశాఖ కార్యాచరణ రూపొందించింది. అందులో భాగంగా ఆయిల్‌పామ్ సాగుచేపట్టేలా ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ ఏడాది జిల్లాలో 2,500ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగుచేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 950 ఎకరాలకు ప్రభుత్వం మొక్కలు మంజూరు చేసింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

వరికి ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలతోపాటు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగుకు రైతులను ఉద్యానశాఖ ప్రోత్సహిస్తోంది. ఉద్యానశాఖతో పాటు రాష్ట్ర సహకార నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య లిమిటెడ్ (టీఎస్ ఆయిల్‌ఫెడ్) అధికారులు రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో రెండేళ్లలో 3,500 ఎకరాల వరకు ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా ఈ పంట సాగును మరింత విస్తరించనున్నారు. సాగుకు ముందుకు వచ్చే రైతులకు మొక్కలు పంపిణీ చేసేందుకు మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో నర్సరీ కూడా ఏర్పాటుచేశారు. ఎకరాకు 57 మొక్కల చొప్పున నాటేందుకు 3.30లక్షలకు పైగా మొక్కలు ఇక్కడ పెంచుతున్నారు. ప్రస్తుతం సిరాడ్, ఎంఎల్-161 అనే రకాల మొక్కలు పెంచుతున్నారు. మండలాల వారీగా ఆసక్తి ఉన్న రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. రైతుల భూముల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. చవుడు నేలలు తప్ప మిగతా అన్ని నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం. ఈ నేపథ్యంలో రైతుల భూములు పరిశీలించి, మొక్కలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,500ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నది లక్ష్యం కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 950ఎకరాల్లో సాగుకు మొక్కలు మంజూరు చేశారు.

ఆయిల్‌పామ్ సాగు ఇలా

ఉద్యాన పంటల్లో ముఖ్యమైనది ఆయిల్‌పామ్. ఈ పంట ద్వారా రైతులకు ఆదాయం కూడా ఎక్కువే. ఆయిల్‌పామ్ సాగుకు అనువైన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఈ పంట సాగుతో రైతులు సంవత్సరానికి నికరంగా రూ.73వేల ఆదాయాన్ని పొందవచ్చు. టీనేరా హైబ్రిడ్ ప్రపంచంలోనే అధికంగా పండించే ఏకైక వంగడం. ఏ కాలంలోనైనా మొక్కలు నాటుకోవచ్చు. నాటేందుకు 12-14నెలల వయసు కలిగి, 1 నుంచి 1.3మీటర్ల ఎత్తు, 13ఆకులతో కాండం, మొదలు మంచిగా ఉన్న మొక్కలను ఉపయోగించాలి. మొక్కలు నాటేటప్పుడు 9/9/9 మీటర్ల దూరంతో త్రికోణాకారంలో హెక్టారుకు 143, ఎకరాకు 57మొక్కలు వచ్చేట్టు నాటుకోవాలి. 60 సెంటీమీటర్ల పొడవు, వెడల్పు, లోతు తీసిన గుంతల్లో వీటిని నాటాలి. ఆయిల్‌పామ్ పంటకు నెలకు 150 మి.మీ, ఏడాదికి, 1800-3000 మి.మీ వర్షపాతం అవసరం. సరాసరి అత్యల్ప ఉష్ణోగ్రత 22-24డిగ్రీల సెల్సియస్. సరాసరి అత్యధిక ఉష్ణోగ్రత 29-33 డిగ్రీ సెల్సియస్ మధ్యలో ఆయిల్‌పామ్ సాగుచేసుకోవచ్చు. సూర్యరశ్మి రోజుకు కనీసం ఐదుగంటలు ఉండాలి. దాదాపు అన్ని రకాల నేలలు అనుకూలం. కానీ, నీరు నిల్వని లోతైన ఒండ్రు నేలలు, అధిక సేంద్రీయ పదార్థం కలిగి, నీరు తేలికగా ఇంకే గుణం ఉండాలి. ఆయిల్‌పామ్ అధిక దిగుబడి ఇచ్చేందుకు సమృద్ధిగా సాగునీరు అవసరం. వేసవిలో కూడా పుష్కలంగా నీరు అందించే బోరుబావుల కింద సాగు చేయడం మేలు. ఎకరా వరి సాగుకు అవసరమయ్యే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చు. సీజన్ బట్టి పాదుల్లో తగినంత తేమ ఉండేలా నీరు అందించాలి. నీటి కొరత వల్ల ఆకుల ఉత్పత్తి తగ్గి, పెరుగుదల సన్నగిలి, తదుపరి కాలంలో ఎక్కువ మగ పుష్పాలు వచ్చి, తద్వారా దిగుబడి.

- మిగతా 8వ పేజీలో...

తప్పనున్న కోతుల బెడద

హైదరాబాద్ నగరానికి జిల్లా చేరువలో ఉన్నా ఇక్కడి రైతులు కూరగాయల సాగుకు వెనకడుగు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కోతులు బెడద అధికంగా ఉంది. కోతులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూరగాయల పంటల సాగుకు రైతులు జంకుతున్నారు. అందుకే కోతుల బెడద లేని ఆయిల్‌పామ్‌కు ఆసక్తి చూపుతున్నారు. అదేవిధంగా ఈ పంట సాగులో తెగుళ్ల, చీడపీడలు చాలా తక్కువ. ప్రకృతి వైపరీత్యాలను సైతం సమర్థంగా తట్టుకుంటుంది. కోతులు, అడవి పందులు బెడద కూడా ఉండదు. జిల్లాలోని చౌటుప్పల్, నారాయణపురం, వలిగొండ, ఆత్మకూరు, గుండాల, రామన్నపేట, మోత్కూరు తదితర మండలాల్లో రైతులు ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. అయితే అన్ని మండలాల్లో ఈ పంట సాగును విస్తరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

శాఖపై ప్రజలకు నమ్మకం కలిగించాలి: డీసీపీ

గుండాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలతో మర్యాదగా మెలుగుతూ శాఖపై నమ్మకం కలిగించాలని డీసీపీ రాజేష్‌చంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. సాధారణ తనిఖీలో భాగంగా వచ్చిన ఆయన స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఆయన వెంట సీఐ కొండల్‌రావు, ఎస్‌ఐ సైదులు, తదితరులు ఉన్నారు.



గుండాల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర



సన్నాల సాగుకు రైతుల మొగ్గు

- ఉమ్మడి జిల్లాలో చిట్టిపొట్టికి పెరిగిన డిమాండ్
- పెట్టుబడి తక్కువ ధర ఎక్కువ ఉండడంతో సాగు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): వానాకాలం, యాసంగి సీజన్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతాంగం ఎక్కువగా వరి పంటను సాగుచేస్తున్నారు. అందులో ఎక్కువగా సన్నరకం ధాన్యం పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధిక దిగుబడి, పెట్టుబడి తక్కువ, పంట కాలం కూడా తక్కువ ఉండే విధంగా విత్తన కంపెనీలు వరి విత్తనాలు తయారు చేసి మార్కెట్‌లో అందుబాటులో ఉంచాయి.

మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలు లభ్యం..

వానాకాలం, యాసంగి సీజన్లలో సన్నాల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. దిగుబడి ఎక్కువగా రావడంతో వాటికి ధర కూడా ఎక్కువగా ఉంటుంది. మార్కెట్లలో సన్నరకాలకు డిమాండ్ బాగా ఉంది. తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా సన్నరకం ధాన్యం ఎగుమతి అవుతుంది. దీంతో సన్నరకం ధాన్యం రైతులకు మంచి లాభాలు తెచ్చిపెడుతుంది. మార్కెట్‌లో పలు విత్తన కంపెనీలు నాణ్యమైన మేలైన సన్నరకం విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చిట్టిపొట్టికి పెరిగిన డిమాండ్..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులు ఎక్కువగా చిట్టిపొట్టి రకం ధాన్యం సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం మార్కెట్‌లోకి వచ్చిన జీనెక్స్ సీడ్స్ కంపెనీకి చెందిన చిట్టిపొట్టికి డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో లభించే ఇతర విత్తనాల కంటే చిట్టిపొట్టి అన్నింటా రైతులకు మేలు చేకూర్చుతుంది. ఈరకం విత్తనాలు సాగు చేస్తే వరి తక్కువ ఎత్తులో పెరుగుతుంది. దీంతో గాలి, వానలు వచ్చినప్పటికీ వరి నేలకొరగకుండా ఉంటుంది. అంతేకాకుండా ధాన్యం సన్నగా ఉంటుంది. ఎకరానికి సుమారు 28క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఇతర వంగడాలతో పోలిస్తే చిట్టిపొట్టి వంగడానికి సాగుకయ్యే ఖర్చు చాలా తక్కువ. ఎకరాలకు 10 కిలోల విత్తనాలు సాగు చేసేందుకు సరిపోతున్నాయి. దీంతో రైతులు చిటిపొట్టి రకం ధాన్యం సాగు చేసేందుకు మొగ్గు చూపతున్నారు.

ఎనిమిదేళ్లుగా సాగు చేస్తున్నా..



చిట్టిపొట్టి రకం సన్నరకం ధాన్యాన్ని ఎనిమిదేళ్లగా సాగు చేస్తున్నా. ఈసీజన్‌లో 10 ఎకరాలు సాగు చేశా. గతంలో ఇతర రకం సాగు చేశాను. వాటితో పోలిస్తే చిట్టిపొట్టి రకం మంచి దిగుబడి వచ్చింది. ఎకరానికి సుమారు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధర కూడా క్వింటాకు రూ2వేలకు పైగా విక్రయించాను.

- గుజ్జుల రవీందర్‌రెడ్డి, చిలుకూరు మండలం, సూర్యాపేట జిల్లా.

అధిక దిగుబడి.. ధర ఎక్కువ వస్తుందని సాగు చేస్తున్నా




చిట్టిపొట్టి రకం ధాన్యం సాగు చేయడం వలన అధిక దిగుబడి వస్తుంది. అంతేకాక మార్కెట్‌లో ధర కూడా ఆశించిన మేర వస్తుంది. ప్రస్తుతం ఈసీజన్‌లో 30 ఎకరాల్లో సాగు చేశా. ఎలాంటి నేలలోనైనా సాగుకు అనుకూలంగా ఉంది. ఈరకం వంగడం పంట తక్కువ ఎత్తు పెరిగి పిలకలు ఎక్కువగా వస్తున్నాయి. బియ్యం కూడా సన్నగా, పొడవుగా ఉంటున్నాయి.

- తాటికొండ రమేష్‌రెడ్డి, ఎర్రగట్టు, హుజూర్‌నగర్ మండలం, సూర్యాపేట జిల్లా.

ఉమ్మడి జిల్లాలో చిట్టిపొట్టికి పెరిగిన డిమాండ్

ఉమ్మడి జిల్లాలో జీనెక్స్ సీడ్స్ కంపెనీకి చెందిన చిటిపొట్టికి డిమాండ్ పెరిగింది. సన్న రకాల్లో ఈవంగడం అధిక దిగుబడులు ఇవ్వడం, పెట్టుబడి తక్కువ కావడం, తక్కువ కాలంలో పంట చేతికి రావడంతో పాటు మార్కెట్‌లో ఈరకం ధాన్యానికి ధర అధికంగా ఉంది. రైస్‌మిల్లుల యజమానులు చిట్టిపొట్టి రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు సుమారు 11లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో ఎక్కువగా సన్నరకమే ఉన్నాయి.

Advt



6

శివోహం

కార్తీక పౌర్ణమికి ముస్తాబైన శివాలయాలు

తెల్లవారుజాము నుంచే దీపారాధనలు

అధికారులు బాధ్యతగా పని చేయాలి

- ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సంబంధిత కోర్టు కేసులు, ధరణి మాడ్యూల్స్, యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, ఓటరు నమోదు సవరణ, ప్రజాపాలన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ధరణి మాడ్యూల్స్ పెండింగ్‌లో ఉంచకుండా తహసీల్దార్లు పరిష్కరించాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ, మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తులు పెండింగులో ఉంచవద్దన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్య, నాణ్యమై భోజనం అందించాలి

విద్యార్థులకు మంచి విద్య, నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం మండలంలోని సైదాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీచేశారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాలలదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కొద్దిసేపు ముచ్చటించి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

శివోహం

- కార్తీక పౌర్ణమికి ముస్తాబైన శివాలయాలు
- తెల్లవారుజాము నుంచే దీపారాధనలు మొదలు
- విద్యుద్దీపాలతో ఆలయాల అలంకరణ



కార్తీక పౌర్ణమి వేడుకకు శివాలయాలు ముస్తాబయ్యాయి. శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో భక్తులు ఉపవాసాలు ఉండటంతో పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ మహిళలు బ్రహ్మముహూర్తంలోనే కార్తీక దీపాలు వెలిగిస్తారు. ఇదిలా ఉండగా పౌర్ణమి వేడుకల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తుల రాక ఉండే నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను ఇప్పటికే విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం ఉదయం నుంచి ఆలయాలన్నీ శివోహం అనే నామస్మరణతో మార్మోగనున్నాయి.



దక్షిణకాశీ కొలనుపాక

ఆలేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక ప్రసిద్ధి. ఈ ప్రాంతానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. ఇక్కడి సోమేశ్వర దేవాలయం వీరశైవ మత స్థాపకుడు రేణుకాచార్యులు ఇక్కడే లింగోద్భావం పొంది వెయ్యేళ్లు ఈ భూ మండలం మీద శైవమత ప్రచారం చేసి ఇక్కడే శివైక్యం పొందినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ ఆలయాన్ని 1070 నుంచి 1126 కాలంలో పశ్చిమ చాలుక్యుల కాలంతో నిర్మించారు. ఇక్కడి లింగం స్వయంభూలింగంగా వెలిసింది. ఇందులో చండీమాత ఆలయం, కోటి లింగేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది. కోటి లింగాలను ప్రతిష్ఠించే సమయంలో వెయ్యి లింగాలు తక్కువ అవడంలో ఒక రాయిపై వెయ్యి లింగాలను చెక్కడంతో దీనిని కోటొక్క లింగంగా పిలుస్తారు.

ఇలా వెళ్లాలి

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి మధ్యలోని ఆలేరు నుంచి బచ్చన్నపేటకు వెళ్లే దారిలో కొలనుపాక ఉంది. హైదరాబాద్ నుంచి 80కిలోమీటర్ల దూరంలో ఉండగా జిల్లా కేంద్రమైన భువనగిరి నుంచి 28 కిలోమీటర్లు, ఆలేరు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి బస్సు మార్గం ఉంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు రైలులో ఆలేరుకు చేరుకొని ఈ క్షేత్రాన్ని దర్శిస్తుంటారు. ఇక్కడికి కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు.



మహిమాన్విత రామలింగేశ్వరుడు

మోత్కూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి శైవక్షేత్రానికి జిల్లాలో విశేష ప్రాశస్త్యం ఉంది. శ్రీరాముడు సీతను వెతకడానికి వెళుతూ ఇక్కడ బసచేసి ఆలయంలోని శివలింగానికి పూజలు చేశాడని, అందుకే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంగా పేరొచ్చిందంటారు. అన్ని ఆలయాల ముఖద్వారాలు తూర్పు వైపు ఉంటుండగా, ఈ ఆలయం ముఖద్వారం పడమర వైపు ఉంటుంది. ఆలయం చుట్టూ రాతి మాళిగ ఉంది. వరి కోతలకు ముందు పచ్చని పొలాల మధ్య ఆలయం చూడముచ్చటగా ఉండి, ఆహ్లాదాన్ని పంచుతుంది. కార్తీకమాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడ పూజలు, దీపారాధనలు చేస్తారు. కార్తీక సోమవారాలు ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారు.

జిల్లా కేంద్రం నుంచి 42 కిలోమీటర్లు

మోత్కూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం నుంచి 42 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి 54 కిలోమీటర్ల దూరం ఉంటుంది. హైదరాబాద్-తొర్రూరు రహదారిలో ఉండటంతో భువనగిరి నుంచి మోత్కూరుకు వెళ్లేందుకు ప్రతీ 20 నిమిషాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. నల్లగొండ నుంచి ప్రతీ గంటకు ఒక ఆర్టీసీ బస్సు ఉంది. మోత్కూరు బస్టాండ్‌కు సమీపంలోనే ఆలయం ఉంటుంది. నడిచి వెళ్లవచ్చు.



వీరభద్రస్వామి ఆలయం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో 400 ఏళ్ల కిందటి కాకతీయుల నాటి ఆలయం ఉంది. కొలనుపాకలోని సోమేశ్వర లింగోద్భవులు వీరసింహన స్థాపకులు జగద్గురువు రేణుకాచార్యులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. శివుడు తూర్పు ముఖంగా, వీరభద్రస్వామి ఉత్తరముఖంగా, పార్వతీదేవి దక్షిణదిశగా ఉంటాయి. క్షేత్రపాలకుడిగా భలభటుడు, శ్రీఆంజనేయస్వామి ఉన్నారు. ఆలయానికి ఈశాన్యదిశగా పుష్కరిణి ఉంటుంది. గత 20 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఆలయాన్ని శుభ్రం చేసి వెలుగులోకి తీసుకువచ్చారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి అమ్మవార్లను దర్శించుకుని వెళ్తుంటారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వగ్రామం సైదాపురంలో ఆలయం ఉండటం ఆయన ప్రతీ శుభకార్యం చేపట్టే ముందు స్వామి వారిని దర్శించుకుని పనులు ప్రారంభిస్తారు. ఆలయంలో ప్రత్యేకంగా జరిగే ప్రతీ కార్యక్రమానికి దంపతులు పాల్గొని పూజలు నిర్వహిస్తుంటారు.

ఇలా వెళ్లాలి

వీరభద్రస్వామి వారి ఆలయం భునగిరి జిల్లా కేంద్రం నుంచి యాదగిరిగుట్టకు రూ.40తో రానుపోను ఆర్టీసీ బస్సుల చార్జీలు ఉంటాయి. గుట్ట నుంచి ఆటోల ద్వారా మరో రూ.20తో ఆలయానికి వెళ్లే అవకాశం ఉంది. ద్విచక్రవాహనాలు, కార్లలో సైతం భక్తులు వస్తుంటారు. ప్రస్తుతం ప్రతిరోజుతో పాటుగా సోమవారాల్లో భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుంటున్నారు.

చరిత్రకు సజీవ సాక్ష్యంగా పజ్జూరు



తిప్పర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఆనవాళ్లు, పురావస్తు దేవాలయాలు కలిగిన గ్రామం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని పజ్జూరు. ఈ గ్రామంలో రెండువేల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన శాతవాహనులు, కల్యాణిచాళిక్యులు, కాకతీయరాజులు ఈ గ్రామంలో నివాసం ఉన్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఆ కాలంలో నిర్మించిన శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. పురాతన దేవాలయాలు మండలంలోని రామలింగాలగూడెం గ్రామంలో శ్రీ భక్తమార్కండేయస్వామి దేవాలయం, మామిడాల గ్రామంలో దక్షిణముఖ ద్వారం కలిగిన చెన్నకేశవ ఆలయం, పజ్జూరు గ్రామంలో గోకర్ణేశ్వరస్వామి(శివాలయం) వంటి దేవాలయాలు ఉన్నాయి. అత్యంత ఎక్కువగా పురాతన దేవాలయాలు కలిగిన పజ్జూరు గ్రామంలో ఇప్పటికీ పొలాల్లో, ముళ్ల పొదల్లో దేవతామూర్తుల విగ్రహాలు కనిపిస్తున్నాయి.

పజ్జూరులోని గోకర్ణేశ్వరస్వామి దేవాలయానికి రెండు వేల ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఈ ఆలయానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి భక్తులువస్తుంటారు. మహాశివరాత్రికి విశేషపూజలు నిర్వహిస్తారు. పూర్తిగా రాతి కట్టడం ఉన్న ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి గ్రామస్థులు కృషి చేస్తున్నారు.

వెళ్లేందుకు మార్గం

పట్టణానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి చందనపల్లి మీదుగా పానగల్ రోడ్డులో ఆటో,ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యాలు ఉన్నాయి. వాహనాల్లో వెళ్లే భక్తులు నల్లగొండ నుంచి మిర్యాలగూడ వెళ్లేదారిలో కంకణాలపల్లి గ్రామం నుంచి వెళ్లవచ్చు.

దక్షిణ భారతదేశ నాభిక్షేత్రం



భువనగిరి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయాన్ని దక్షిణ భారతదేశ నాభిక్షేత్రంగా పరిగణిస్తుంటారు. శ్రీరాముడి కాలంలోనే ఈ ఆలయం ఉన్నట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. పచ్చటకట్ట సోమేశ్వరాలయంలో జరిగే పూజలతో దక్షిణ భారతదేశం సుసంపన్నంగా భాసిల్లుతుందని భక్తుల నమ్మకం. రోజువారీ పూజలతో పాటు సోమవారం ప్రత్యేక అర్చనలు, నాలుగు రోజులపాటు శివరాత్రి వేడుకలు, కార్తీకమాసం పూజలు విశిష్ట రీతిలో నిర్వహిస్తుంటారు. సుమారు 90 ఏళ్ల కిందట ఆలయ ప్రాచుర్యాన్ని తెలుసుకొని వెతుక్కుంటూ వచ్చిన ఉత్తర భారతదేశానికి చెందిన అంతయ్య మహారాజ్‌కు శిథిలావస్థలో ఉన్న సోమేశ్వరాలయం దర్శనమిచ్చింది. దీంతో కలత చెందిన ఆయన భక్తుల సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. అనంతరం కొద్ది కాలానికి ఆలయ సమీపంలోనే జీవసమాధి అయినట్టు ప్రచారంలో ఉంది. తిరిగి 2004లో భక్తులు ప్రస్తుత ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయంలోని సోమేశ్వర లింగం పచ్చరంగులో ఉండటం, భువనగిరి పెద్ద చెరువుకట్ట దిగువలో ఆలయం ఉండటంతో ఆలయం పేరు పచ్చలకట్ట సోమేశ్వరాలయంగా స్థిరపడింది. భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా సమీపంలో ఆలయం ఉంది. ఆలయం నుంచి బస్టాండ్ ఒక కిలోమీటర్, రైల్వేస్టేషన్ మూడు కిలోమీటర్లు దూరంలో ఉంటాయి.




సంగమ క్షేత్రం.. వాడపల్లి

దామరచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామం కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రాంతం. ఇక్కడ ఉన్న మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆలయ ప్రాశస్త్యం ప్రకారం కృతయుగంలో అగస్త్య ముని శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు చెబుతుంటారు. ఆ తరువాత ఒక బోయవాడు పక్షిని వేటాడే క్రమంలో అది శివలింగం వెనుకబాగాన దాక్కుంది. దీంతో బలవంతంగా పక్షిని చంపబోయిన బోయవాడితో శివుడు ఇలా అన్నాడు, తన శరణు కోరి వచ్చిన పక్షికి హాని చేయవద్దని దానికి ప్రతిగా తన మాంసం తీసుకోవాలని కోరుతాడు. దీంతో ఆ బోయవాడు తన చేతి పది వేళ్లతో శివలింగం పైభాగంలోని మాంసాన్ని పెకిలిస్తాడు. ఆ వెంటనే ఆ ప్రాంతంలో గంగ ఉద్భవిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. తదనంతర కాలంలో శివలింగం పుట్టతో నిండిపోయింది. తరువాత 600 ఏళ్ల కిందట ఈ ప్రాంతాన్ని పాలించిన రెడ్డిరాజులు ఈ ప్రదేశంలో గ్రామాన్ని నిర్మించే క్రమంలో శివలింగం బయటపడింది. దీంతో వారు ఆలయాన్ని నిర్మించారు. స్వామి వారు శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర స్వామిగా విరాజిల్లుతున్నారు. శివలింగం పైభాగం నుంచి తోడిన కొద్ది గంగ ఉద్భవిస్తుంది. 1524లో ఈ వింతను పరీక్షించబోయిన జగద్గురు ఆదిశంకరాచార్యులకు భంగపాటు ఎదురైంది. భగవంతుడిని పరీక్షించడం తన తప్పుగా భావించి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు శాసనంలో ఉంది. పర్వదినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. మహా శివరాత్రి, ఏకాదశి, కార్తీక మాసంలో భక్తుల రద్దీతో కిటకిటలాడుతుంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఆలయ ప్రాంగణంలోని మరో విశిష్టమైన ప్రాశస్త్యం కలిగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఆలయంలోని స్వామి ఎదుట ఉన్న రెండు ప్రమిదల్లో ఎగువ భాగంలో ఉన్న ప్రమిద కదులుతుండగా దిగువ భాగంలోని ప్రమిద నిశ్చలంగా ఉంటుంది. స్వామి వారి ఉచ్వాస, నిశ్వాస కారణంగా ఎగువ భాగంలోని ప్రమిద కదులుతున్నట్లు భక్తుల విశ్వాసం.

ఆలయానికి చేరుకునేందుకు...

ఆలయానికి చేరుకునేందుకు మిర్యాలగూడ నుంచి వాడపల్లికి 25కిలోమీటర్ల దూరం ఉంటుంది. మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఆలయం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి కిలోమీటరు దూరంలో ఉంటుంది. రాష్ట్ర సరిహద్దులోని నల్లగొండ, పల్నాడు జిల్లాల సరిహద్దులో ఈ ఆలయం ఉంది.



అపవిత్రంగా వెళితే తేనెటీగలు దాడి చేస్తాయి

దేవరకొండ, నవంబరు 14 (ఆంధ్రజోతి) : నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవచర్ల సమీపంలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలోని మునుస్వామి గుట్టపై వెలిసిన శివాలయానికి అపవిత్రంగా వెళితే తేనెటీగలు దాడి చేస్తాయి. 13వ శతాబ్దంలో పరమశివుడు వెలిశాడని స్థల పురాణం. కొండల నుంచి జాలువారే నీరు ప్రతిక్షణం శివలింగాన్ని అభిషేకిస్తుండటం ఇక్కడి విశేషం. దేవరకొండను పరిపాలించిన రేచర్ల పద్మనాయక వెలమ వంశస్థులే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పూర్వీకుల కథనం. అందమైన గుహలు, గుట్టలు, జలపాతాలు ఉన్న ఇక్కడ ప్రతీ శివరాత్రి, ఏకాదశికి ఆలయ నిర్వాహకులు ఉత్సవాలు నిర్వహిస్తారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, గుంటూరు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. శివాలయం వద్ద కొండలు, కోనల నుంచి వచ్చే నీటితో స్నానం చేస్తే రోగాలు పోతాయని నమ్మకం.

దేవరచర్లకు ఇలా వెళ్లాలి

నల్లగొండ జిల్లా దేవరకొండకు 35 కిలోమీటర్ల దూరంలో దేవరచర్ల ఉంది. హైదరాబాద్ నుంచి 135 కిలోమీటర్లు, నల్లగొండ నుంచి 95 కిలోమీటర్లు దూరంలో ఉంది. దేవరచర్లతండా నుంచి శివాలయానికి చేరుకోవాలంటే మూడు కిలోమీటర్లు వెళ్లాలి. గతంలో కాలినడకన వెళ్లే విధంగా దారి ఉండేది. ప్రస్తుతం స్థానికులు, నిర్వాహకులు రోడ్డు మార్గం ఏర్పాటుచేశారు. రెండు కిలోమీటర్ల వరకు డొంకదారి ఉంది. అక్కడి నుంచి శివాలయానికి చేరుకోవాలంటే కొండలు, గుట్టలు, బండరాళ్లు, దట్టమైన చెట్లపొదలు దాటి కిలోమీటరు దూరం నడవాలి.

శివపార్వతులు నడియాడిన నేల



బీబీనగర్ మండలం మహాదేవ్‌పూర్ గ్రామంలో కొలువైన అక్కన్న మాదన్న ఆలయాలు

బీబీనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యం దీప, దూప నైవేద్యాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని మహాదేవ్‌పూర్ గ్రామంలో ఉన్న అక్కన్న మాదన్న ఆలయాలు సాక్షాత్తు శివపార్వతులే నడయాడిన నేలగా ప్రసిద్ధి. ఆరు దశాబ్దాల చారిత్రక నేపథ్యం కలిగిన అద్భుత రాతి కట్టడాలు నాటి ఘనమైన చరిత్ర వైభవానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిర్మాణ శైలి ఆధారంగా కాకతీయుల కాలంలో నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

ఇలా చేరుకోవాలి


హైదరాబాద్-వరంగల్ జాతీయరహదారికి కేవలం 4కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జిల్లా కేంద్రం భువనగిరికి 15కిలోమీటర్లు, హైదరాబాద్ మహానగరానికి 25కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి ఆలయాల దర్శనానికి వెళ్లాలంటే జిల్లా కేంద్రం భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రతి బస్సులో ప్రయాణం చేయవచ్చు. కొండమడుగు మెట్టు వద్ద లేదంటే జిల్లా సరిహద్దు కేపాల్ వద్ద బస్సు దిగి అటు నుంచి ప్రైవేటు లేదంటే సొంత వాహనాల్లో 4కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. బస్సుకు చార్జి రూ.65నుంచి 100లోపే అవుతుంది. అదే హైదరాబాద్ నుంచి వచ్చే వారు కేపాల్ లేదంటే కొండమడుగు మెట్టు వద్ద బస్సు దిగి అక్కడి నుంచి వెళ్లవచ్చు. బస్సుకు అయితే రూ.100, ప్రైవేటు వాహనాల్లో అయితే రూ.1000 నుంచి 1500ఖర్చు అవుతోంది. వ్యక్తిగత వాహనాల్లో వెళ్లాలనుకుంటే రూ.500లోపే ఖర్చు అవుతుంది.

ఆలయ ప్రాశస్త్యం..

ఇక్కడి నిర్మాణ శైలిని బట్టి వీటిని కాకతీయుల కాలంలో నిర్మించినట్లుగా భావిస్తున్నారు. 400 సంవత్సరాల కిందట నిజాం తానీషా ఆస్థానంలో మంత్రిగా, సేనాధిపతిగా పనిచేసిన అక్కన్న మాదన్నలు హైదరాబాద్ దక్కన్ ప్రాంతం నుంచి కప్పం వసూలు చేసేందుకు వరంగల్, భువనగిరి ప్రాంతాలకు ఇదే మార్గం గుండా ప్రయాణం చేసేవారు. అప్పట్లో మట్టి దిబ్బల్లో కూరుకుపోయిన ఈ ఆలయాలను గమనించిన వారు ఆలయాలను పునర్నిర్మించి దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించటంతో, ఈ ఆలయాలకు అక్కన్న మాదన్న ఆలయాలుగా ప్రాచుర్యంలోకి వచ్చాయని గ్రామస్థులు చెబుతారు.

ప్రత్యేకతలు..

అక్కన్న మాదన్న ఆలయాలు సినిమా షూటింగ్‌లు, టీవీ సీరియల్ చిత్రీకరణకు ప్రసిద్ధి చెందాయి. పౌరాణిక, చారిత్రక, ఆధ్యాత్మికతతో కూడిన సినిమాలు, సీరియల్స్‌లోని పలు సన్నివేశాల కోసం ఇక్కడ చిత్రీకరిస్తుంటారు. సినిమా రంగానికి చెందిన కొందరు ప్రముఖులు ఈ దేవాలయాల ఔన్నత్యాన్ని తమ సినిమాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.



చల్లూరు శివశంకరుడు

రాజాపేట,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని చల్లూరు, బొందుగుల, కుర్రారం, రాజాపేట, గ్రామాల్లో శైవాలయాలు ఉన్నాయి. వీటిలో కుర్రారం బసవేశ్వరాలయం, చల్లూరులోని శివశంకర ఆలయాలకు ప్రాధాన్యముంది. చల్లూరులోని శివశంకర ఆలయం 1300 ఏళ్ల క్రితం నిర్మించారు. ఎంతో మహిమాన్వితమైన ఆలయాన్ని 12ఏళ్ల కిందట దాతల సహకారంతో అప్పటి సర్పంచ్ వంచావీరరెడ్డి పునర్నిర్మించారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా మహాశివరాత్రికి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆలయం ఆవరణలో ఉమ్మడి జిల్లాలోని అతిపెద్ద శివలింగాన్ని నిర్మించారు. సుమారు రూ.50 లక్షలతో తొమ్మిది పడగల శివలింగాన్ని నిర్మించారు. 23 అడుగుల ఎత్తయిన దిమ్మెపై 22 అడుగుల శివలింగాన్ని నిర్మించారు. 9 పడగల నాగేంద్రుడు పడగ రూపంలో ఉన్నట్లుగా నిర్మించారు. శివలింగాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేమైన మెట్ల మార్గాన్ని నిర్మించారు. శివలింగం వద్ద కార్తీకమాసంలో భక్తులు దీపాలంకరణ నిర్వహిస్తారు. హైదరబాద్, యాదగిరిగుట్ట, కొమురవెల్లి, ఆలయాలకు వెళ్లే భక్తులు నిత్యం శివాలయాన్ని దర్శించుకొని వెళ్తుంటారు.

చల్లూరుకు ఎలా వెళ్లాలి

చల్లూరు శివశంకర ఆలయాన్ని దర్శించుకునేందుకు బస్సు, ఆటో సౌకర్యం ఉంది. యాదగిరిగుట్ట నుంచి 14 కిలోమీటర్లు, ఆలేరు నుంచి 14 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కీసర ఆలయం నుంచి 42 కిలోమీటర్ల దూరం ఉంటుంది. హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు ఆలేరు యాదగిరిగుట్ట, పట్టణాల నుంచి చల్లూరుకు బస్సులు, ఆటోల ద్వారా చేరుకోవచ్చు. యాదగిరిగుట్ట, రాజాపేట మార్గంలో పొట్టిమర్రిచౌరస్తా నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంటుంది.

పెన్సిల్ మొనపై శివలింగం



కోదాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు తమలపాకల సైదులు కార్తీక పౌర్ణమి సందర్భంగా పెన్సిల్ మొనపై 11 మి.మీ.ల ఎత్తుగల శివలింగాన్ని చెక్కి తన సూక్ష్మకళను ప్రదర్శించారు. శివలింగాన్ని చెక్కేందుకు అరగంట సమయం పట్టినట్టు ఆయన తెలిపారు.

సర్వారం పీఏసీఎస్ పాలక వర్గం రద్దు

గరిడేపల్లి, నవంబరు 14: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దుచేస్తూ సహకార సంఘం జిల్లా అధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంఘంలోని మెజార్టీ సభ్యులు ఏడుగురు రాజీనామా చేయడంతో నవంబరు 6న జరగాల్సిన సమావేశాన్ని రద్దు చేసినట్లు వివరించారు. సభ్యుల రాజీనామాను ఆమోదించి, సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రోజు వారి విధులను నిర్వహించడానికి ఆరునెలలపాటు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సహకార సంఘం పాలక వర్గం రద్దు కావడంతో పర్సన్ ఇన్‌చార్జీ కమిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.కమల, నేరేడుచర్ల సహకార బ్యాంక్ మేనేజర్ సతీష్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పశుఔషధ బ్యాంక్ ప్రారంభం



పశుఔషధ బ్యాంక్‌లో ఔషధాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కోదాడ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పశుఔషధ బ్యాంక్‌ను గురువారం జిల్లా పశువైద్య, పశు సంరక్షణ అధికారి దాచేపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నిరంతరం మేతలో ఖనిజ లవణ మిశ్రమం పశుపోషకులకు పంపిణీకి పశుఔషధ బ్యాంక్‌లో సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య, ముత్తవరపు పూర్ణచందర్‌రావు, చిలుకూరు, కోదాడ మండలాల పశువైద్యాధికారులు వీరారెడ్డి, మధు, పాల్గొన్నారు.

ఆటలతోపాటు చదువులోనూ రాణించాలి

● క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి ● యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ● రాజాపేటలో ముగిసిన జోనల్‌స్థాయి క్రీడలు



బహుమతి ప్రదానం చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

రాజాపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆటలతోపాటు చదువులోనూ రాణించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం రాజాపేట మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జోనల్ స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆటలో గెలుపు ఓటములు సహజమని, విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. జీవితాన్ని క్రీడలు ఎంతో ప్రభావితం చేస్తాయని, శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, జోనల్ ఆఫీసర్ విద్యారాణి డీసీవో జగదీశ్వర్‌రెడ్డి, క్రీడల సమన్వయకర్త శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ రాజు, పీడీ శృతి, శోభారాణి పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్‌ను ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి భరత్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల క్రీడల విజేతలు వీరే..

రాజాపేట మండలకేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న పదో జోనల్‌స్థాయి క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా ఘణపూర్ విద్యార్థులు సాధించినట్లు ప్రిన్సిపల్ సుధాకర్, జోనల్ అధికారి విద్యారాణి తెలిపారు.

● కబడ్డీలో అండర్-14 విభాగంలో మిర్యాలగూడ ప్రథమ, అనుముల ద్వితీయ, అండర్-17లో చండూరు ప్రథమ, మిర్యాలగూడ ద్వితీయ, అండర్-19 అనుముల ప్రథమ, చండూరు ద్వితీయ.

● ఖోఖో అండర్-14లో మునగాల ప్రథమ, హుజూర్‌నగర్ ద్వితీయ, అండర్-17లో మిర్యాలగూడ ప్రథమ, చండూరు ద్వితీయ, అండర్-19లో మిర్యాలగూడ ప్రథమ, మునగాల ద్వితీయ.

● వాలీబాల్ అండర్-17లో మునగాల ప్రథమ, భువనగిరి ద్వితీయ, అండర్-19లో రాజాపేట ప్రథమ, మోత్కూరు ద్వితీయ, హ్యాండ్‌బాల్ అండర్-17లో ఘణపూర్ ప్రథమ, రాజాపేట ద్వితీయ, అండర్-19 జనగామ ప్రథమ, రాజాపేట ద్వితీయ.

● బాల్‌బ్యాండ్మింటన్ అండర్-17లో మిర్యాలగూడ ప్రథమ, చండూరు ద్వితీయ, అండర్-19 మిర్యాలగూడ ఘణపూర్ ద్వితీయ.

● ఫుట్‌బాల్ అండర్-17లో చండూరు ప్రథమ భువనగిరి ద్వితీయ, అండర్-19 ఘణపూర్ ప్రథమ, రాజాపేట ద్వితీయ.

● టెన్నికాయిట్ డబుల్‌లో అండర్-14లో ఘణపూర్ ప్రథమ, నకిరేకల్ ద్వితీయ, అండర్-17లో ఘణపూర్ ప్రథమ, అనుముల ద్వితీయ అండర్-19 ఘణపూర్ ప్రథమ, భువనగిరి, ద్వితీయ.

● చెస్ సింగిల్స్‌లో అనుముల ప్రథమ మిర్యాలగూడ ద్వితీయ, అండర్-17లో మిర్యాలగూడ ప్రథమ, మునగాల ద్వితీయ, అండర్-19లో ఘణపూర్ ప్రథమ, తిప్పర్తి ద్వితీయ.

● క్యారమ్స్ డబుల్‌లో హుజూర్‌నగర్ ప్రథమ, మునగాల ద్వితీయ, అండర్-17 అనుముల ప్రథమ, ఘన్‌పూర్ ద్వితీయ, అండర్-19లో చివ్వెంల భువనగిరి ద్వితీయ బహుమతులు గెల్చుకున్నారు.

● అండర్-14లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ హుజూర్‌నగర్, అండర్-17లో మిర్యాలగూడ, అండర్-19లో ఘణపూర్ పొందాయని వారు తెలిపారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.125	190	220
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.20
టీఎంసీలు	301.3570
ఎడమకాల్వకు నీటి విడుదల	9500
కుడికాల్వకు	6556
విద్యుత్ కేంద్రం ద్వారా	12424
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	31,280 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.27 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.10 అడుగులు
టీఎంసీలు	4.22
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత
ఇన్‌ఫ్లో	652.65 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	44.88 క్యూసెక్కులు

వికారాబాద్ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట టీజేఏసీ ఉద్యోగుల ధర్నా



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో అధికారులపై దాడి చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. అధికారులపై జరిగిన దాడులను ఖండిస్తూ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. విధులకు ఆటంకం కలగకుండా మధ్యాహ్న భోజన విరామ సమయంలో జిల్లా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ధర్నాకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలో ఉందని కాకుండా, అధికారం ఉన్న ప్రభుత్వానికి అధికారుల కృషితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణకోసం పోరాడి సాధించుకున్న ఉద్యోగులకు తమ విధుల నిర్వహణలో భద్రత లేకుండాపోవడం ఇబ్బందికరమన్నారు. ప్రజలకోసం పనిచేసే అధికారులపై దాడులు తగవన్నారు. జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ధరణికోట భగత్‌లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఇలాంటి దాడులు జరగలేదని, ఇది అత్యంత పాశవిక చర్యగా అభివర్ణించారు. ధర్నా అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, టీజీవో అధ్యక్షుడు జగన్‌మోహన ప్రసాద్, కార్యదర్శి చిలుకూరు శ్రీనివాస్, శశికాంత్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, శైలజ, కవిత, బానాల రాంరెడ్డి, దేశ్యా నాయక్, డాక్టర్ చైతన్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేట(కలెక్టరేట్): వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, ఉద్యోగులపై జరిగిన దాడి అమానుషమని టీజీఈజేఏసీ జిల్లా నాయకులు అన్నారు. గురువారం లగచర్లదాడిని ఖండిస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జానిమియా, దున్న శ్యాం, గోపి, భూపాల్‌రెడ్డి, పాండునాయక్, డీఆర్‌డీవో అప్పారావు, గోలి హరిచంద్రప్రసాద్, జగదీష్‌రెడ్డి, రవికుమార్, రమేష్, మౌలానా, నాగేందర్ పాల్గొన్నారు.

కేతేపల్లి: విధి నిర్వహణలో ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు పరమేష్ కోరారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై లగచర్లలో జరిగిన దాడిని ఖండిస్తూ నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని బీమారం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కే భిక్షమయ్య, కన్నె శివయ్య, జీ రమేష్, ఎల్ శ్రీధర్, జీ వెంకటేశ్వర్లు, ఎం శేఖర్, డీ నాగయ్య, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాచా నెహ్రూ.. క్షమించు



నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని నెహ్రూ విగ్రహాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రాజెక్ట్ నిర్మాత అయిన నెహ్రూ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం నవంబర్ 14న నివాళులు అర్పిస్తూ వచ్చారు. కానీ గత రెండేళ్లుగా పట్టించుకోకపోవడంతో చర్చనీయాంశమైంది.

(నాగార్జునసాగర్-ఆంధ్రజ్యోతి)

లగచర్ల ఘటనలో పరోక్షంగా కేటీఆర్ ప్రమేయం

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడిలో పరోక్షంగా కేటీఆర్ ప్రమేయం ఉందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంట - గురజాల సమీపంలో మూసీ నదిలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి గురువారం ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ లగచర్ల ఘటనలో మాజీ మంత్రి కేటీఆర్ చిల్లరగా మాట్లాడుతున్నాడని, ఇటువంటి వ్యక్తిని ఎన్నడూ చూడలేదన్నారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ సత్యనారాయణ, డీఈ సత్యనారాయణ, ఏఈఈ చంద్రశేఖర్, విక్రమ్, నాయకులు పాల్గొన్నారు.

ఐదు పీహెచ్‌సీలకు డ్రోన్ వైద్య సేవలు

● ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా



సమావేశంలో మాట్లాడుతున్న వికాస్ భాటియా

బీబీనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో డ్రోన్ సేవలు విప్లవాత్మక మార్పులకు నిదర్శనమని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్‌భాటియా అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన డ్రోన్ సేవలను ఆయన బీబీనగర్ మండలం కొండమడుగు ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ భాటియా మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని గిరిజన పర్వత శ్రేణి దూర ప్రాంతాల నుంచి నేషనల్ ట్యూబర్క్‌లోషిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఈపీ) ద్వారా నమూనాలను, మందులను రవాణా చేయడానికి డ్రోన్ వినియోగిస్తామన్నారు. బొల్లేపల్లి పీహెచ్‌సీలో 2023 డిసెంబరు 23న మొదటిసారి ట్రయల్ డ్రోన్ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. ఎనిమిది కిలోల సామర్థ్యం కలిగిన పెద్దది, 3కేజీలు కలిగిన సామర్థ్యం కలిగిన మరో చిన్న డ్రోన్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 5ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కొండమడుగు, బొమ్మలరామారం, బొల్లేపల్లి, భువనగిరి, రామన్నపేట ప్రధాన ఆరోగ్య కేంద్రాలతో పాటు వర్కట్‌పల్లి, మునిపంపుల పీహెచ్‌సీల పరిధిలో ఈ సేవలు వినియోగిస్తామన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి కల్యాణతంతు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 28,84,542 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. రాష్ట్ర ఇంటలిజెన్స్ డైరెక్టర్ జనరల్ బి.శశిధర్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దివ్య విమాన రాజగోపురానికి బంగారు తాపడం పనులు ఈ నెల 15న (శుక్రవారం) కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రారంభించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

గర్భగుడి శుభ్రం చేస్తుండగా మంటలు

● ధోతికి నిప్పు అంటుకుని అర్చకుడికి గాయాలు

నకిరేకల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గర్భగుడిని శుభ్రం చేస్తుండగా దీపానికి ఉన్న నిప్పు అంటుకుని అర్చకుడికి గాయాలయ్యాయి. గురువారం నల్లగొండ జిల్లా నకిరేకల్ శివాలయంలో ఈ సంఘటన జరిగింది. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీక్షిత్ అభిషేక్(40) స్థానిక శివాలయంలో కొంతకాలంగా అర్చకుడిగా పనిచేస్తున్నారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం ఆలయం గర్భగుడిలో ఫ్లోర్‌క్లీనర్ కెమికల్(ఫినాయిల్)తో శుభ్రం చేస్తుండగా, విగ్రహం సమీపంలో ఉన్న దీపపు మంట పూజారి ధోతికి అంటుకుంది. ధోతిని విప్పుతున్న క్రమంలో మంటలు అంటుకోవటంతో చేతికి, కాళ్లకు, నడుము కింది భాగంలో గాయాలయ్యాయి.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతోంది



ఓవరల్ ఛాంపియన్‌షిప్‌లో డిండి విద్యార్థులు

డిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ భావం కూడా పెంపొందిస్తాయని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. నాలుగురోజులుగా నల్లగొండ జిల్లాడిండిలో నిర్వహిస్తున్న సాం ఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలో గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆర్డీవో హాజరై మాట్లాడారు. విజేతలకు ప్రిన్సిపాల్ శిరీషతో కలిసి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ అంజనేయు లు, ఎంపీడీవో వెంకన్న, సునీత, సిరి, జ్యోతిర్మయి, శ్రీదేవి, నాగలక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

ఓవరల్ ఛాంపియన్ డిండి

10వ జోనల్ స్థాయి క్రీడల్లో డిండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఓవరల్ ఛాంపియన్ షిప్ దక్కించుకుంది. అండర్ 14 విభాగంలో దీపిక(జీవిగూడ), అండర్-17 విభాగంలో జె.ప్రసన్న(డిండి),అండర్-19 విభా గంలో భానుప్రియ(డిండి), ఓవరల్ ఛాంపి యన్‌షిప్ అండర్-14 విభాగంలో జీవిగూడెం, అండర్-17 విభాగంలో డిండి,అండర్-19 విభా గంలో డిండి గెలుపొందగా అథ్లెటిక్స్‌లో అండర్-14 విభాగంలో నకిరేకల్, అండర్-17 విభాగంలో డిండి, అండర్-19 విభాగంలో డిండి ఛాంపియన్‌షిప్‌లో నిలిచాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కథ, రచయిత పోటీల్లో అశ్రితకు రాష్ట్ర ప్రథమబహుమతి



ప్రముఖుల నుంచి బహుమతి అందుకుంటున్న అశ్రిత

నకిరేకల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథ, రచయిత పోటీల్లో నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ విద్యార్థిని ఆకటి అశ్రిత ప్రథమ బహుమతి సాధించింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సంగీత, నాటక అధ్యక్షుడు ఆచార్య అలైక్య పుంజాల, లోక కవి అందెశ్రీ నుంచి అశ్రిత ప్రథమ బహుమతితో పాటు రూ.3 వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నట్లు ఎంఈవో మేక నాగయ్య తెలిపారు.'నేను డాక్టర్‌ను అవుతా' అనే కథకు బహుమతి లభించినట్లు ఎంఈవో తెలిపారు. అశ్రితను ఆయనతో పాటు ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్‌చంద్ర, మార్త రాములు, నర్ర వెంకట్‌రెడ్డి, కోటయ్య, నూకల జానయ్య తదితరులు అభినందించారు.

బీసీ డెడికేటెడ్ కమిషన్ రాక రేపు

నల్లగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను నిర్ధారించే నిమిత్తం సిఫార్సులు చేసేందుకు ప్రభుత్వం నియమించిన బీసీ డెడికేటెడ్ కమిషన్ ఈ నెల 16వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రానికి ప్రజాభిప్రాయసేకరణ నిమిత్తం వస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.సైదులు కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్నివర్గాల నుంచి వినతిపత్రాలు, ఆక్షేపణలు, సూచనలు, సలహాలు, అభ్యంతరాలు, అభ్యర్థనలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఈ కార్యక్రమం మొదలవుతుందని వెల్లడించారు. ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ కమిషన్‌కు వ్యక్తులు, నమోదిత, నమోదు కాని ఆర్గనైజేషన్లు, కుల సంఘాల నుంచి వారి వాదనలకు మద్ధతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను సంబంధిత విషయాలను పేర్కొనాలని సూచించారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేణలు డెడికేటెడ్ కమిషన్‌కు తెలియజేయవచ్చని వెల్లడించారు. ఈ సదవకాశాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సంబంధిత వర్గాల వారంతా వినియోగించుకోవాలని ప్రకటనలో కలెక్టర్ సూచించారు.

రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్ ఇమ్రోజ్



బహుమతులు అందుకుంటున్న ఇమ్రోజ్, అమర్‌నాథ్

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ బాలుర విభాగం పోటీల్లో నల్లగొండ జిల్లా కేంద్రం గౌతమి కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి బాషిక్ ఇమ్రోజ్ ఛాంపియన్‌షిప్ సాధించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 19 నుంచి కలకత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఇమ్రోజ్ ఎంపికయ్యారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాలకు చెందిన అమరనాథ్ నాలుగో స్థానం సాధించారు. జాతీయస్థాయికి ఎంపికైన వీరిద్దరిని నల్లగొండ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కోచ్ మట్టయ్య, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఇందిరలు ప్రత్యేకంగా అభినందించారు.

తెలుగు సాహిత్యరంగంలో నిలిచే విద్యార్థుల యాత్ర జర్నీ కథనం



పుస్తకావిష్కరణ చేస్తున్న వక్తలు

చిట్యాలరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆహ్లాదం కోసం చేసిన విహారయాత్రను కథల రూపంలోకి అనువదించడం తెలుగు సాహిత్య రంగంలో నిలిచిపోనుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు రచించిన జర్నీ కథా సంకలనం పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. సరదా యాత్రను కథనం రూపంలో బాహ్యప్రపంచానికి పుస్తకరూపంలో పంచుకోవడం నూతనధ్యాయమన్నారు. వట్టిమర్తి విద్యార్థుల ప్రయోగం ఇతర విద్యార్థులను అందరినీ ఆలోచింపజేస్తుందన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

నల్లగొండటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సులకు సంబంధించిన ఏవైనా సూచనలు, సలహాల కోసం 08682-223307 నంబర్‌కు ఫోన్ చేయాలని ఒక ప్రకటనలో కోరారు. అదేవిదంగా నల్లగొండ డిపో పరిధికి సంబంధించి కూడా శుక్రవారం అదేసమయంలో డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నటు డిపో మేనేజర్ శ్రీనాథ్ తెలిపారు. 9959226305 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

మునుగోడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా మునుగోడు మండలకేంద్రానికి చెందిన యాట విజయ్‌కుమార్‌ను పోక్సో కేసులో గురువారం రిమాండ్ చేసినట్లు చండూరు సీఐ వెంకటయ్య తెలిపారు. మండలంలోని ఓగ్రామానికి బాలికను ప్రేమ పేరుతో మోసగించినట్లు తెలి పారు. బాలిక తండ్రి ఫిర్యాదుపై ఈ నెల 11న కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు చేపట్టామన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని సీఐ తెలిపారు.

30కిలోల ఫ్లోరల్ హైడ్రేడ్ పట్టివేత

నకిరేకల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కల్లు తయారీలో వాడుతున్న 30 కిలోల ఫ్లోరల్ హైడ్రేడ్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌నాయకత్వంలో ఎన్‌ఫోర్స్ టీమ్ గురువారం దాడులు నిర్వహించగా నరేష్, వెంకటేష్ అనే వ్యక్తులు ఫ్లోరల్‌హైడ్రేడ్ తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. విచారణలో కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన గోపి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. గోపీతో పాటు నరేష్, వెంకటేష్‌లను అరెస్టు చేసి పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ మల్లేష్, సిబ్బంది స్వామి, శ్రీను, శేఖర్ రెడ్డి, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలం అంజనేయపురం గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. రైతు నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి గేదె పొలంలో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తలిగి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ఆదుకోవాలని రైతు కోరారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్యాంసుందర్

భువనగిరి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులను పరిరక్షించాలని భువనగిరి సీనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధి కార సంస్థ, గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాహక్కు, బాలకార్మిక నిర్మూలన తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్లు జైపాల్, శంకర్, పాల్గొన్నారు.

● భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భువనగిరిలో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో గురువారం జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి అదనపు కలెక్టర్ గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ బాలల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహ, డీఆర్‌డీవో నాగిరెడ్డి, డీఈవో సత్యనా రాయణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయ శ్రీ పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గురువారం బాలల దినో త్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియడారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశార మోత్కూరులో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, దత్తప్ప గూడెం లో మాజీ పంచాయతీ సమితి అధ్యక్షుడు కంచర్ల శంకర్‌రెడ్డి, రిటైర్డు సైంటిస్టు అక్కెనపల్లి రఘురాంరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దత్తప్పగూడెం పాఠశాలలో వనం ఫౌండేషన్ ద్వారా ల్యాబ్ సౌకర్యం కల్పిస్తామని రఘురాంరావు హామీ ఇచ్చారు. కంచర్ల అంజిరెడ్డి పాఠశాలకు రూ.50 వేల విలువైన ఫర్నిచర్ అందజేశారు. కంచర్ల యాదగిరిరెడ్డి, సత్యనారాయణరెడ్డి వేదికను నిర్మించారు. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామాల్లో వండ కొండ మల్లేష్ బ్రదర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని స్థానిక సీఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పూస బాలకిషన్ ప్రారంభించారు. పల్లివాడ ప్రాథమిక పాఠశాలలో సేవ్ ట్రీస్- సేవ్ నేచర్ కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

షాదీఖానా కొత్త కార్యవర్గం నియామకం



కరీమ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని ఎలిమినేటి మాధవరెడ్డి షాదీ ఖానకు ప్రభుత్వం గురువారం కొత్త కమిటీని నియమించింది. చైర్మన్‌గా ఎండీకరీమ్, డైరెక్టర్లుగా కమ్రుద్దీన్, జహీర్, షారూఖ్, అబ్బాస్ బేగంను నియమించారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు అధికారంలో ఉంటుంది. కాగా, షాదీఖానా కొత్త కమిటీని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంల కౌన్సిలర్ ఎండీ. బాబా షరీఫ్, రామాలయం చైర్మన్ బి.మురళి, షాదీఖాన మాజీ చైర్మన్ ఎండీ.రహీమ్, పాషా పాల్గొన్నారు.

'ఇండియా మిషన్ ఆస్తుల విక్రయాలను అడ్డుకుంటాం'

భువనగిరి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని విలువైన ఇండియామిషన్ ఆస్తులను విక్రయించేందుకు కొద్ది మంది చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని అంతర్జాతీయ మిషన్స్ భారత అధ్యక్ష కార్యదర్శులు ఎం ఐజాక్, అంకరి కుమార్ అన్నారు. గురువారం ఇండియామిషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి ఆస్తులను విక్రయించే ప్రయత్నాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సమావేశంలో మిషన్స్ డైరెక్టర్లు ధనుంజయ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఇండియా మిషన్ స్కూల్ కరస్పాండెంట్ జూడ కోశాధికారి వల్లూరి ప్రభాకర్, పాస్టర్లు సభ్యుల పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు షురూ



భూదాన్‌పోచంపల్లిలో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు

మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సహకార వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మోత్కూరులో కోఆపరేటివ్ బ్యాంకు, రైతు సేవాసహకార సంఘంలో రైతు సేవాసహకార సంఘం ఎదుట చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, కోఆపరేటివ్ బ్యాంకు ఎదుట మేనేజరు అమరేందర్‌రెడ్డి సహకార జెండా ఎగుర వేశారు. పోచంపల్లిలో ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు భవనంపై సహకార జెండాను చైర్మన్ తడక రమేష్ ఎగురవేశారు. రామ న్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి జెండా ఆవిష్కరించారు. మోత్కూరులో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పురగుల మల్లయ్య, మునిసి పల్ కౌన్సిలర్ పురుగుల వెంకన్న, పోచం పల్లిలో బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్, చైర్మన్ తడక రమేష్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు పాల్గొన్నారు. రామన్నపేటలో సీఈవో జంగా రెడ్డి, డైరెక్టర్లు కన్నెకంటి వెంకటేశ్వరచారి, కల్లూరి సైదమ్మ, పిట్ట విజయ్‌క ఎమాం రెడ్డి, కొమ్మ అంజమ్మ, మంగళంపల్లి కొండల్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు ఉపయోగించుకోవాలి

బీబీనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ క్యాంపు ద్వారా అన్ని రకాల ఆరోగ్య సేవలు ఉపయోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని అన్నారు. గురువారం బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల 14న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు .రక్త పరీక్షలతో పాటు హెచ్ఐవీ స్క్రీనింగ్ చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పురుషోత్తం, మౌనిక రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు నర్సింహ మృతి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నేత చేరాల నర్సింహ గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తదితరులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

కంఠమహేశ్వరుడికి జలాభిషేకం



చౌటుప్పల్‌లో జల బిందెలతో వస్తున్న గౌడ కులస్తులు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని కంఠమహేశ్వరస్వామి కల్యాణోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం గౌడ కులస్తులు శివలింగానికి జలాభిషేకం చేశారు. ప్రతి ఇంటి నుంచి బిందె జలాన్ని తీసుకువెళ్లి జలాభిషేకం, వస్త్రాలంకరణ, హోమం, మోకు- ముస్తాదులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, గౌడ సంఘం అధ్యక్షుడు చింతకింది అంజయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, మొగుదాల రమేష్, మల్లేశం పాల్గొన్నారు.

కాగా, సురమాంబ- కంఠమహేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంఠమహేశ్వరస్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలు అరిగోస



విలేకర్లతో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం) నవంబరు14:(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల పాలనలోనే సబ్బండ వర్గాల ప్రజలు అరిగోస పడుతున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కిం దన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 10 నెలల పాలనలో ఏ ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు చేయలేకపోయాడని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పథకం అటకెక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో మహాదిట్ట అన్నారు. కాంగ్రెస్ ప్రభ ుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రా లు సకాలంలో ఏర్పాటు చేయకుండా దళారులను ప్రోత్సహించి రైతాంగాన్ని నష్టాల పాలు చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులను ప్రోత్సహిస్తూ ఎక్సైజ్ సీఐలకు టార్గెట్ పెట్టడం దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. టార్గెట్ పూర్తి చేయని 15 మంది సీఐలకు నోటీసులు జారీ చేసిన ఈ ప్రభుత్వానికి సిగ్గు చేటు అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోరె భిక్షపతి, మండల కార్యదర్శి మామిడి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగయ్య, సత్యనారాయణ, దశరథ, పాల్గొన్నారు.



మత్స్యగిరి గుట్టపైన స్వామిని ఆరాధిస్తున్న రుత్వికులు

మత్స్యగిరి బ్రహ్మోత్సవాల సందడి

వలిగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటపురం గ్రామపంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టపైన జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసా గుతోన్నాయి. స్వయంభూనరసింహుడికి సుప్రభాతసేవతో అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఉగ్రమూర్తిని సమస్త దేవతలు స్తుతించి చతుర్వేద పారాయణం చేసి శాంతింపజేశారు. మత్స్యగిరి కల్యాణం తదుపరి రుత్వికులు శ్రీ సుదర్శన నరసింహ స్వామి ఇష్టిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గర్భాలయంలో హోమ గుండం 108 స్తోత్రాలు హవనం జరిపారు.

చతుస్థానార్చన హోమాలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో వేకువజామున నుంచి యాగశాల ద్వారతోరణం జరిపారు. భక్తులు ధ్వజస్తంభం కార్తీకదీపాలు వెలిగించి స్వామికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పూర్ణహుతి, బలివారణం నివేదన తీర్థప్రసాదా గోష్టిలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో మోహన్‌బాబు, చైర్మన్ కొమ్మిరెడ్డి నరేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్యం కలిగించేలా జానీమియా కవితలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు

ఆలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థి జానీమియా రాసిన బాలగేయాలు కవితలు చైతన్యపరిచే విధంగా ఉండ టంతో పాటు పరిజ్ఞానాన్ని పెంపొందించే ఉన్నాయని జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ మంజుల అన్నారు. ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే విధంగా బాలగేయాలు ఉన్నాయని అన్నారు. అన్ని విషయా లను కళ్లకు కట్టినట్టు చూపించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, పూలనాగయ్య, వెంకటేశ్వర్లు, నాగేంద్రస్వామి సైదులు, శ్రీధర్, సుధారాణి, రాజు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

గుండాల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆలేరు ఏడీఏ డి.పద్మావతి అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంతో పాటు మండలంలోని వస్తాకొండూరులో గురువారం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ధాన్యం కేంద్రాల ఆకస్మిక తనిఖీ

రాజాపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందుగుల, నెమిల, సోమారం దూదివెంకటపూర్ గ్రామాల్లోని ధాన్యపు కొనుగోలు కేంద్రాలను గురువారం మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో కిషన్, పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ

భువనగిరి రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు లోనై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం భువనగిరి శివారులోని పగిడిపల్లి సమీపంలో గల మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనార్థాలు, సైబర్ క్రైం, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ శ్రీకాంత్, సిబ్బం ది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

భువనగిరి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల బస్సుల కష్టాలు పరిష్కారానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్టు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ బందారపు శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట డిపో పరిధిలో ఎదురవుతున్న ప్రయాణ ఇబ్బందులపై శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య సెల్‌నంబర్ 9959226310కు ఫోన్ చేయాలని సూచించారు. సూచనలు, సలహాలు కూడా ఇవ్వవచ్చని తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి కార్మికుడి మృతి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) మండలం లోని జూలూరు గ్రామంలో గురువారం బిల్డింగ్ నిర్మాణ పనులు చేస్తుండగా కిందపడి కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరసాపురానికి చెందిన క్రాంతి వలస వచ్చి బీబీనగర్‌కు చెందిన శ్రీనివాస్ మేస్త్రీ వద్ద ఆరు నెల లుగా కూలీగా పనిచేస్తున్నాడు. అయితే గురువారం బిల్డింగ్ రేలింగ్ పనులు చేసే నిమిత్తంగా ప్లాస్టిగ్ పని చేయడం కోసం ఏర్పాటు చేసుకున్న గోతాడు ఎక్కి పనిచేస్తు ండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడనే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. తల్లి శివకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

● ఆలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు నాణ్యమైన పత్తి కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అయినాల చైతన్యరెడ్డి కోరారు. ఆలేరులోమల్లిఖార్జున కాటన్ ఇండస్ట్రీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు.

● చౌటుప్పల్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : అంకిరెడ్డిగూడెం గ్రామంలోని బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి అబ్దుల్‌ఖాదర్ (15) అదృశ్యమయ్యాడు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన అబ్దుల్ ఖాదర్ స్వగ్రామం నుంచి ఈనెల 13న తల్లి బేగంతో కలిసి హాస్టల్‌కు బయలు దేరారు. కుమారుడిని చౌటుప్పల్ బస్టాండ్‌లో దింపి ఇంటికి వెళ్లిపోయింది. ఖాదర్ హాస్టల్‌కు వెళ్లకుండా అదృశ్యమ య్యా డు. గురువారం తల్లి బేగం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● భువనగిరి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాయ దశరథ, బండారు జయశ్రీ,పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుముకుల గ్రామంలో మట్టిమోనే ప్రాంతంలో అక్రమంగా మైనింగ్ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మైనింగ్ పనులను సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకుల అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నెల్లికంటి జంగయ్య, కోట భూపాల్‌రెడ్డి, కోట జన్‌రెడ్డి, కోట పాండురంగారెడ్డి, కత్తి యాదయ్య, చుక్క శంకరయ్య, ఇస్తారి పాల్గొన్నారు.

● ఆలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకు అనుకూలంగా మధ్యాహ్న భోజన మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈవో లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కాసుల నరేష్ వడ్ల గణేష్, దొరగల్ల రాజు పాల్గొన్నారు.

● ఆలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) ఆలేరుకు చెందిన భువనగిరి గణేష్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కమిటీ సభ్యులుగా వడ్డెమాన్ విప్లవ్ ఎన్నికయ్యారు. వలిగొండ మండలం ఈనెల 11 జరిగిన డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలో ఆయన ఎన్నుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గుట్టలో కల్యాణ లక్ష్మి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

● *ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య*

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 14 : అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గుట్ట పట్టణంలో గురువారం యాదగిరిగుట్ట, తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట, ఆత్మకూర్, గుండాల , మోటకొండూర్ మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన 288 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన సర్వేకు సహకరించాలని దాంతో ప్రజలకు ఎంతో మేలు జరుగతోందని అన్నారు. అంతకు ముందు మండలంలోని జంగపల్లి డీపీని పరిశీలించి దాతరుపల్లి చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం దాతరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని సాధ్యమైనంతవరకు పరిశీలిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చైతన్యరెడ్డి, యాదగిరిగుట్ట కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు యాదగిరిగౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్ గౌడ్, ఎడ్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తా : నన్నూరి నర్సిరెడ్డి



గుట్టలో టీడీపీ సభ్యత్వ కరపత్రాలను విడుదల చేస్తున్న నన్నూరి నర్సిరెడ్డి, బక్కిని నర్సింహులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 14 : రాష్ట్రంలో టీడీపీకీ పూర్వ వైభవం తీసుకు రావడానికి ప్రయత్నిస్తానని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. గురువారం యాదగిరిగుట్టలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీకి పునర్వైభవం కల్పించడానికే సభ్యత్వ నమోదు శ్రీకారం చుట్టామన్నారు. సభ్యత్వ పొందిన ప్రతి కార్యకర్తకు రూ. 5లక్షల బీమా ఉంటుందని తెలిపారు.

టీటీడీ కల్యాణ మండపం పరిశీలన

భువనగిరి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) భువనగిరిలోని టీటీడీ కల్యాణ మండపాన్ని టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి పరిశీలించారు. కొన్నేళ్లుగా కల్యాణ మండపం నిరుపయోగంగా ఉండటం, నిర్వహ ణ తీరుపై సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఆరు నెలలుగా తమకు వేతనాలు రావడం లేదని ఇబ్బంది తెలిపారు.

రెండు రోజుల్లో జరగనున్న టీటీడీ పాలకమండలి సమావేశంలో భువనగిరి కల్యాణ మండపం దుస్థితిని ప్రస్తావిస్తానన్నారు. అంతకు ముందు టీడీపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు కార్యక్రమాల్లో టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కిని నర్సింహులు, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కుంద రపు కృష్ణాచారి, పట్టణ, మండల అధ్యక్షులు బచ్చు శ్రీనివాస్ గుప్తా, రమేష్ యాదవ్, సురకంటి జంగారెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ పూల మార్కెట్ కిటకిట



చౌటుప్పల్ సర్వీసు రోడ్డులో గల పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి, దీపావళి నోములకు నేడు చివరి రోజు కావడంతో చౌటుప్పల్ పట్టణంలోని సర్వీస్ రోడ్డులో గల పూల మార్కెట్ కొనుగోలు దారులతో కిటకిటలాడింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండ చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథకుమార్, విజయ్ మోహన్ చర్యలు తీసుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

(5పేజీ తరువాయి)

తగ్గిపోతుంది. పాదుల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలి. మూడేళ్ల పైబడిన ఆయిల్‌పామ్ మొక్కలకు వర్షాకాలంలో దాదాపు 100-150 లీటర్లు, శీతాకాలంలో 160-170 లీటర్లు, వేసవికాలంలో 215-265 లీటర్లు నీటిని ప్రతీరోజు అందించాలి. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండి, వడగాల్పులు ఉంటే 300-350 లీటర్లు అందించాలి. డ్రిప్ విధానంలో సాగునీరు అందించడం ఉత్తమమైన పద్ధతి. ఒక్కో చెట్టుకు ఎరువులను మూడు నెలల వ్యవధితో మూడు సార్లు వేసుకోవాలి. మూడో సంవత్సరంలో సిఫార్సు చేసిన ఎరువులు వేయాలి. నాలుగో ఏడాది నుంచి ఎరువుల అవసరం ఉండదు. మొదటి దఫా ఎరువును నాటిన మూడు నెలల తర్వాత మాత్రమే వేయాలి. రెండో దఫా ఎరువులతో పాటు 50-100 కిలోగ్రాములు పశువుల ఎరువుల లేదా 100కిలో గ్రాముల పచ్చిరొట్ట వేయాలి. 5కిలోల వేపపిండి వేసుకోవాలి. కలుపు తీసిన పాదుల్లో చెట్టు మొదలు నుంచి రెండు అడుగుల దూరంలో పీచువేర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో పాదుచుట్టూ ఎరువులు చల్లి వెంటనే నీరు అందించాలి.

రాయితీపై మొక్కల పంపిణీ

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు జిల్లాకు ఒక కోర్డినేటర్‌తో పాటు కొన్ని మండలాలకు కలిపి ఫీల్డ్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించింది. ఆయిల్‌పామ్ పంటలో మొదటి మూడేళ్లు అంతర్ పంటగా కూరగాయలు, మొక్కజొన్న, వేరుశనగ, అరటి, జామ, బొప్పాయి సాగుచేయవచ్చు. అందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఇంపోర్టెడ్ ఆయిల్‌పామ్ మొక్కలైతే ఒక్కో మొక్కకు ప్రభుత్వం రూ.193 చొప్పున, ప్రభుత్వం హెక్టారుకు 150 మొక్కలకు రూ.29,000 రాయితీ ఇస్తోంది. ఒక్కో మొక్కకు రైతు వాటా కింద రూ.20 డీహెచ్ఎస్‌వో పేరున డీడీ తీయాలి. తోటల నిర్వహణకు మొదటి నాలుగేళ్లు ఎకరాకు ప్రభుత్వం రూ.5,250చొప్పున రాయితీ ఇస్తుంది. అదేవిధంగా అంతర్ పంటల కోసం మొదటి నాలుగేళ్లు హెక్టారుకు రూ.4200 చొప్పున రాయితీ ఇస్తుంది. బిందు సేద్యంపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీ ఉంది. ఆసక్తి ఉన్న రైతులు జిల్లా ఉద్యాన, ఆయిల్‌ఫెడ్‌శాఖ అధికారులను సంప్రదించాలి.

కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో సాగుచేసిన ఆయిల్‌పామ్ దిగుబడిని స్థానికంగా మార్కెటింగ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో, 5-9 ఏళ్ల వయసు ఉన్న తోటల నుంచి సాలీనా హెక్టారుకు 25 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తుంది. వచ్చే ఐదేళ్లలో పెద్ద మొత్తంలో ఆయిల్‌పామ్ దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో సుదూర ప్రాం తాల్లో ఉన్న కంపెనీలకు తరలించాలంటే రైతులపై రవాణా భారం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వలిగొండ, రామన్నపేట మండలాల్లో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పామాయిల్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం యోచించింది. తాజాగా, ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కంపెనీని ఏ ప్రాంతంలో ఏర్పాటుచేస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

రైతులకు అవగాహన

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ సాగు ద్వారా రైతులకు వచ్చే దిగుబడి, నికర ఆదాయాన్ని వివరిస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది 2,500ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రణాళికను రూపొందించాం. ఇప్పటివరకు 950 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు అనుమతులు ఇచ్చాం. ఈ ఎంట సాగుకు ముందుకొచ్చే రైతులను ప్రోత్సహించి, మొక్కలు పంపిణీ చేస్తాం. ఆయిల్‌పామ్ గెలల కొనుగోలులో దళారీ వ్యవస్థ లేదు. నేరుగా ప్రభుత్వరంగసంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేస్తుంది. మొక్కల పెంపకానికి, అంతర్‌పంటల కోసం ప్రభుత్వం నాలుగేళ్లు రాయితీలు కల్పిస్తుంది. రైతులకు డ్రిప్ సౌకర్యం కోసం రాయితీ కూడా ఉంది.

-సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి